http/www.tholipoddu.com

# తొలిపొద్దు

డిజిటల్ డైలీ

7-11-2025 | శుక్రవారం

సంపుటి : 2 | సంచిక : 41 | పేజీలు : 4 | వెల : 5

Circulated in Hyderabad, Ranga Reddy, Adilabad, Nizamabad, Karimnagar, Warangala, Mahabubnagar, Nalgonda, Sangareddy, Khammam and Kurnool

## నేటి కేబినేట్ భేటీ వాయిదా

### తిరిగి 12న జరపాలని నిర్ణయం

తొలిపొద్దు, హైదరాబాద్

నేడు జరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 12న తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. హైకోర్టు తీర్పు కారణంగా వాయిదా పడిన స్థానిక ఎన్నికలపై చివరిసారిగా జరిగిన కేబినెట్‌లోనూ క్లారిటీ రాలేదు. నవంబర్ 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ శుక్రవారం జరగాల్సిన కేబినెట్ సమావేశాన్ని ఈ నెల 12వ తేదీకి ప్రభుత్వం వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అమల్లో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తున్నట్లు గత కేబినెట్ సమావేశం సందర్భంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 21(3)ని తొలగించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

## జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యంగా సాగాలి

- చిన్న ఏమరుపాటు కూడా పనికి రాదు
- ఈ మూడు రోజులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి
- ప్రతి ఓటరును కలిసి మన వాయిస్ వినిపించాలి
- బిఆర్ఎస్ దుష్ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలి
- మంత్రులు, పార్టీ నేతలకు సిఎం దిశానిర్దేశం

తొలిపొద్దు హైదరాబాద్


File Photo

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించారు. ఇక్కడ ఖచ్చితంగా గెలవబోతున్నామని, అందువల్ల మెర్జీ కోసం కృషి చేయాలన్నారు. అలాగే ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ బూత్‌కు వచ్చి ఓటేసేలా చూసుకోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గత నెల 31, ఈ నెల 1, 4, 5 తేదీల్లో నియోజక వర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో.. క్షేత్ర స్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్ష చేసినట్లు తెలుస్తోంది. మొత్తం మంత్రులందరికి బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి....ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశంచేసినట్లు తెలుస్తోంది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలువబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. మంత్రులు, పార్టీ నాయకులు అందరూ మూడు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి గట్టిగా కౌంటర్ ఇవ్వాలని సూచించారు. మంత్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రోజుకో సర్వేను వదులుతూ ప్రజలను, ఓటర్లను బీఆర్ఎస్ సోషల్ మీడియా గందరగోళానికి గురి చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఫీల్డ్ లో కాంగ్రెస్ కు బలం ఉందని, నవీన్ యాదవ్ మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని గ్రౌండ్ రిపోర్టులు చెబుతున్నాయని అన్నారు. ప్రచారానికి ఇంకా మూడు రోజులే మిగిలి ఉందని, ప్రతి గంటనూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఓటరుకు మన వాయిస్ చేరాలని అన్నారు. మనం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు చేర్చే బాధ్యతను మంత్రులు, పార్టీ నాయకులు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు రోజుల్లో పోల్ మేనేజ్మెంట్ పై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటి వరకు సాగిన ప్రచారంపై రివ్యూ చేశారు. ఈ సెగ్మెంట్ లో పోలింగ్ పర్సంటేజీ పెంచడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సీఎం ఈ రివ్యూలో సూచించినట్టు సమాచారం. ఇక్కడ మొత్తం 4,01,365 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 2,08,561మంది, మహిళలు 1,92,779 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. వీళ్లంతా 139 పోలింగ్ కేంద్రాల్లోని 407 పోలింగ్ బూత్ లలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ చాలా తక్కువగా పోలింగ్ శాతం నమోదవుతోంది. ఇక్కడ 2009 లో 52.76 శాతం, 2014లో 50.18, 2018లో 45.59 2023లో 47.49 శాతం పోలింగ్ నమోదవుతోంది. దానిని పెంచడం, ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రం వరకూ వచ్చేలా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సీఎం చెప్పినట్టు సమాచారం. దీంతో పాటు బస్తీల వారీగా పరిస్థితిని కూడా సీఎం సమీక్షించినట్టు తెలుస్తోంది.

## గతంలో వచ్చిన 25వేల ఓట్లు తెచ్చుకోగలరా?

- మీకు పదివేల లోపే ఓట్లు రాలుతాయి
- కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం సవాల్

తొలిపొద్దు, హైదరాబాద్



కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి సవాల్ విసిరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన అభ్యర్థికి 25 వేల ఓట్లు వచ్చాయని, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో 25 వేలకు ఒక్క ఓటు తగ్గకుండా తీసుకువస్తే.. మీరేం చెబితే అందుకు తాను సిద్ధం అని చెప్పారు. 25 వేల ఓట్లు బీజేపీ అభ్యర్థికి రాకపోతే.. తాను చెప్పింది చేయడానికి కిషన్ రెడ్డి సిద్ధమా? అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పదివేల లోపే బీజేపీకి ఓట్లు వస్తాయని పొన్నం ప్రభాకర్ జోస్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్ గూడలో ప్రచారంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'మా అభ్యర్థి యువకుడు, స్థానికుడు, ఉత్సాహవంతుడు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధికి అవకాశం ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. గతంలో అధికారంలో ఉండి కూడా అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు మావైపు ఉన్నారు. మేము అధికారంలోకి వచ్చి అందించిన అనేక సంక్షేమ పథకాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ తరపున సానుకూలంగా ఉన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలు ఏ విధంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని అభివృద్ధి చేయించు కుంటున్నారో.. ఇక్కడి ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీని గెలిపించి అభివృద్ధి చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ పెన్షన్లు ఇచ్చిన నిధులను కూడా లెక్క చెబితే.. అది అభివృద్ధి అవుతుందా?. అభివృద్ధి చేయడం అంటే ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా డెవలప్ చేయడం. ఈ రెండు నెలల్లోనే ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా 2500 కోట్ల అభివృద్ధి పనులను చేశామని అన్నారు. 'దివంగత మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదు. ఇక మా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇక్కడ సమస్యలను రిప్రెంటేషన్ చేయడంలో విఫలమయ్యాడు. భవిష్యత్తులో జూబ్లీహిల్స్ సంబంధించిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కిషన్ రెడ్డికి సహకరించింది. అందుకే ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గురుదక్షిణగా బీజేపీ అభ్యర్థిని బీఆర్ఎస్కు తాకట్టు పెట్టాడు. మీ ప్రచారం సరళి చూసిన ప్రజలు మీ సొంత ఎమ్మెల్యే రాజాసింగ్ బీఆర్ఎస్ పార్టీకి లొంగిపోయారని అంటున్నారు. బీఆర్ఎస్, బీజేపీలో మీ ఓటు ఎటు వేసిన సరే అనే ప్రవర్తన కనిపిస్తుందని ప్రజలే అంటున్నారు. మీరు కేంద్ర మంత్రిగా ఉన్నారు.. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నారు. ఈ శాసనసభ నియోజకవర్గంలో కూడా మీ పార్లమెంట్ పరిధిలోకే వస్తది. మరి నా చాలెంజ్ కు కిషన్ రెడ్డి సిద్ధమా?. ప్రజల స్పందన చూస్తే కచ్చితంగా మెజారిటీతోనే జూబ్లీహిల్స్ గెలవబోతున్నాం' అని మంత్రి పొన్నం ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ కల్చర్ పుణ్యం కెటిఆర్‌దే: తుమ్మల

తొలిపొద్దు, హైదరాబాద్



సీఎం రేవంత్ రెడ్డి పెట్టే ఇబ్బందుల కారణంగానే పారిశ్రామిక వేత్తలు తెలంగాణ వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు తెలంగాణలో డ్రగ్, గన్ కల్చర్ తెచ్చిందే కేటీఆర్ అని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలు తెలంగాణ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని కేటీఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గురువారం (నవంబర్ 6) జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఓట్ల కోసం ఇచ్చిన వాగ్దానాలు, లక్షలాది కోట్ల బాకీల సంగతి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత ఇబ్బంది కరంగా ఉన్నప్పటికీ గడిచిన 20 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదన్న తుమ్మల.. పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు రోజుకొకరు తెలంగాణకు వస్తున్నట్లు చెప్పారు.

## ఆఫ్రికన్ నత్తలతో బెంబేలు

తొలిపొద్దు హైదరాబాద్



సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఆఫ్రికన్ నత్తలు భయాందోళనలకు గురి చేస్తున్నాయి. న్యూబోయిన్‌పల్లి మిలటరీకి చెందిన మూడు ఎకరాల విస్తీర్ణంలో ఆఫ్రికన్ నత్తలు కన్పించాయి. దీంతో అధికారులు అప్రమత్తమై నత్తల నివారణా చర్యలు చేపట్టారు. వనంలోని ప్రహరీ గోడతో పాటు చెట్లు, పుట్టలపై రసాయనాలు, ఉప్పు ద్రావ ణాలు చల్లి వాటిని చంపివేశారు. ఈ నత్తలు ఆకు లు, చిగుర్లు, కాండం, పూత పిందలనే కాకుండా ఏకంగా వృక్షాలనే కొరికివేయగలవని అధికారులు తెలిపారు.

## చీమల ఫోబియాతో మహిళ ఆత్మహత్య

తొలిపొద్దు, సంగారెడ్డి

అనేక మంది అనేక రకాల వ్యాధులతో, మానసిక ఇబ్బందులతో చనిపోతుంటారు. ఆరోగ్యం బాగాలేక, లైఫ్ ఫెయిల్యూర్ కావడం, డిప్రెషన్, లోన్ల ఒత్తిడి వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కానీ ఇందుకు భిన్నంగా తాజాగా జరిగిన ఓ ఘటన తీవ్రంగా కలిచివేస్తోంది. ఎలాంటి ఆరోగ్య సమస్యలు, ఫైనాన్సియల్ సమస్యలు, లైఫ్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు లేకపోయినా ఆమె చనిపోయింది. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసిన సూసైడ్ నోట్ ఒక్కసారిగా షాక్ కు గురి చేస్తోంది. ఇలా కూడా చనిపోతారా? వామ్మో అంటూ ఈ విషయం తెలుసుకున్నవారు ఆశ్చర్యానికి గురవుతున్నారు.సంగారెడ్డిలో జరిగిన ఈ ఘటన తీవ్రంగా కలచివేస్తోంది.ఓ మహిళ అనూహ్యంగా మరణించిన ఘటన సంగారెడ్డి జిల్లాలో జరిగింది. చీమల ఫోబియాతో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని శర్వా హోమ్స్ లో మనీషా ఉరి వేసుకొని సూసైడ్ చేసుకుంది. చీమల ఫోబియాతో తాను చనిపోతున్నానని, తన కూతురు జాగ్రత్త అంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చీమల ఫోబియాతో మహిళా చనిపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహిణి మరణించడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది.

## తెలంగాణ వర్సిటీలో 45మంది ప్రొఫెసర్లకు షాక్

- ఆనాటి నియామకాలు చెల్లవంటూ హైకోర్టు తీర్పు

తొలిపొద్దు హైదరాబాద్

తెలంగాణ యూనివర్సిటీలో 2012 నాటి నియామకాలు చెల్లవని హైకోర్టు తన తుది తీర్పులో స్పష్టం చేసింది. 2012లో జారీ చేసిన నోటిఫికేషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ జరిపి.. ఈ తీర్పును వెలువరించింది. ఈ తాజా తీర్పు కారణంగా 45 మంది ప్రొఫెసర్లు.. తమ ఉద్యోగాలను కోల్పోయినట్లు అవుతుంది. అయితే కొత్త నోటిఫికేషన్లు జారీ చేసుకో వచ్చంటూ తెలంగాణ యూనివర్సిటీకి ఈ సందర్భంగా హైకోర్టు స్పష్టం చేసింది. 2012లో 91 పోస్టులకు తెలంగాణ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2012లో విడుదలైన సదరు నోటిఫికేషన్‌లో చేర్చాల్సిన పోస్టులు చేర్చక పోవడం.. అలాగే చేర్చకూడని పోస్టులు చేర్చారంటూ పలువురు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. నేపథ్యంలో దాఖలపై పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సుదీర్ఘ విచారణ చేపట్టింది. గురువారం తన తుది తీర్పును హైకోర్టు వెలువరించింది. మరోవైపు.. స్జబెక్టుల రోస్టర్ పాయింట్లు మారిపోయాయని ఈ సందర్భంగా హైకోర్టు దృష్టికి పిటిషనర్లు తీసుకు వెళ్లారు.

## జూబ్లీహిల్స్ అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

- ఇందులో గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాత్రా ఉంది
- ప్రచారంలో గత హామీలపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్
- సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదే
- ముస్లింలు కాంగ్రెస్‌కు ఇజ్జత్ అయితే..మరి హిందువులో
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కిషన్ రెడ్డి

తొలిపొద్దు, హైదరాబాద్




గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఉప ఎన్నిక అంశంలో ఇంకా సర్వేలలో స్పష్టత లేదని చెప్పారు. సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో భారత రాష్ట్రసమితికి మూడో స్థానం వచ్చిందన్న ఆయన.. ఓటర్లలో ఏ పార్టీకి ఓటు వేయాలో ఇంకా స్పష్టత లేదని చెప్పారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం లో 6 గ్యారంటీలను గానీ, 400 పైచిలుకు హామీల గురించి గానీ ఎక్కడా ప్రస్తావించడం లేదని, వ్యక్తిగత విమర్శలు చేయడంపైనే దృష్టి పెడుతోందని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనేక సమస్యలున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్‌లో లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఏ పార్టీకి ఓటు వేయాలనే దానిపై ఓటర్లు ఇంకా నిర్ణయానికి రాలేదని.. అందుకే సర్వేల్లో కూడా స్పష్టత లేదని కిషన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ వెనుకబాటుకు గతంలో పాలించిన బిఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, గ్యారెంటీలపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదేనని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దీనికి సంబంధించి ఒక పోస్ట్ ను కూడా కిషన్ రెడ్డి తన సోషల్ మీడియా అకౌంట్లో పెట్టారు. 'ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి 'ఇజ్జత్' అంటావు, మరి హిందువులు ఇజ్జత్ కాదా మిస్టర్ రేవంత్ రెడ్డి? మీ కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులకు గౌరవం లేదా? ఎర్రగడ్డలో ఖబరస్థాన్ కోసం స్థలం ఇచ్చేందుకు మనసొచ్చింది కానీ, బంజారాహిల్స్‌లో పెద్దమ్మ తల్లి గుడికి 50 గజాలు స్థలం ఇవ్వడం ఎందుకు కుదరలేదు. హిందువులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవు. ఎన్నాళ్లు మజ్లిస్‌ను భుజాన ఎక్కించుకొని తిరుగుతావో తిరుగు. ప్రజలే నీకు గట్టి బుద్ధి చెబుతారని అంటూ కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఓటు వేయక పోతే సన్న బియ్యం, ఫ్రీ బస్ ఆగిపోతుంది అని సీఎం అన్నారు.. సన్నబియ్యం లో కేంద్ర ప్రభుత్వానిదే సింహభాగం.. ఏ విధంగా సీఎం ఆపుతారో చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. సకల సమస్యలకు పరిష్కారం ఫ్రీ బస్సు అనే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చిన నిధులను, వచ్చిన సంస్థల వివరాలు కిషన్‌రెడ్డి వివరించారు. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో బీబీనగర్ ఎయిమ్స్ భవనాలు ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభమవుతాయని వెల్లడించారు. 2 వందల బస్తీ దవాఖానలు కేంద్రం సహకారంతో నడుస్తున్నాయి. కేసీఆర్ పేరు మార్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 101 అభివృద్ధి కార్యక్రమాలు హైద్రాబాద్ పరిధిలో జరుగుతున్నాయన్నారు. రేవంత్ రెడ్డి స్థాయికు దిగజారి నేను అడ్డుకుంటున్నాను అని మాట్లాడుతున్నారు. మెట్రో గురుంచి కూడా మాట్లాడుతున్నారు.. ఎల్ అండ్ టి మేము చేయలేము అంటుంది? ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాలి? కొత్త డిపిఆర్ కేంద్రానికి ఇవ్వాల్సి ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 'తెలంగాణ బిడ్డగా నా నియోజక వర్గం అభివృద్ధి కోరుకుంటా.. బాధ్యత రహితంగా మాట్లాడుతున్నారు రేవంత్ రెడ్డి.. తెలంగాణ కోసం మా కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించాను.. వివిధ అంశాల పై కేసీఆర్‌కు 40 లెటర్లు రాశాను.. స్పందించలేదు.. అలాంటి వాళ్లు కూడా విమర్శలు చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు.. హైద్రాబాద్ లో డిఫెన్స్ మీద లక్ష 40 వేల కోట్లు ఖర్చు పెట్టింది కేంద్రం.. అని వెల్లడించారు. పత్తి రైతులు ఆందోళన చెందొద్దు? మార్చి వరకు పత్తి కొంటాం.. కాంగ్రెస్ పార్టీ వి కూడా చాలా సార్లు డిపాజిట్ రాలేదు.. జూబ్లీహిల్స్ నాకు తెలుసు? అక్కడి ప్రజలు ఓటు వేసేది.. కౌంటింగ్ రోజు తెలుస్తుంది ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయి.. రేవంత్ రెడ్డి మాటలను సిరియస్ గా తీసుకోవాల్సిన అవసరం లేదు.. ఆయన మాట్లాడుతూ పోతుంటారు మనం వింటూ పోవాలి.. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్ట్ మీద సిబిఐ దర్యాప్తు జరపాలి అని మేము అడుగుతున్నాం.. హై కోర్టులో కేసు నడుస్తుంది.. నేను కూడా ఢిల్లీతో మాట్లాడతా.. ఢిల్లీ స్థాయిలో ఒప్పందం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు జరిగింది. రేవంత్‌ను సీఎంగా కొనసాగించాలని రాహుల్‌కు ఇష్టం లేదని కేటీఆర్ అంటున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఇంటర్ విద్య కీలకమైనది

- సిద్ధిపేట డీఐఈవో రవీందర్ రెడ్డి

తొలిపొద్దు, నంగునూరు :

విద్యార్థి దశలో ఇంటర్ విద్య చాలా కీలకమైనదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్లో బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, అక్కెనపల్లి మోడల్ స్కూల్, నర్మెట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను గురువారం డీఐఈవో రవీందర్ రెడ్డి తనిఖీ చేశారు. ఆయా కళాశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, తరగతి గదుల్లో విద్యా బోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులు బాగా ప్రిపేర్ కావాలని చెప్పారు. విద్యార్థులు 100 శాతం కళాశాలకు హాజరు అయ్యేలా తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ ఆదేశాల మేరకు కళాశాలలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల అకాడమిక్ కార్యక్రమాలతో పాటు, విద్యార్థులు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతున్నారు అనే అంశంపై ప్రత్యేక దృష్టి నిలిపినట్లు తెలిపారు. విద్యార్థులు శత శాతం తరగతులకు హాజరయ్యే విధంగా వారిలో ప్రోత్సాహం నింపేందుకు తనిఖీ చేపట్టామని చెప్పారు. కళాశాలల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.56 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. వీటిలో నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.14 లక్షల నిధులను కేటాయించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు జూనియర్ కళాశాల ప్రధానాచార్యుడు శివకోటి, అక్కనపల్లి మోడల్ స్కూల్ ప్రధానాచార్యుడు జానయ్య, నర్మెట కేజీబీవీ ఎస్ఓ పద్మ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



# దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి




తొలిపొద్దు, కోహెడ :

పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతుల సందర్భంగా నెల రోజుల పాటు సాయంత్రం పూట అల్పాహారాన్ని అందించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం వర్కోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. కృష్ణవేణి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కేంద్రానికి చెందిన దాత సిరికొండ భూశంకర్ చారి నెల రోజులకు సరిపడా అల్పాహారానికి అవసరమైన డబ్బులను సమకూర్చారు. దీంతో గురువారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని చెప్పారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో దాతలను స్ఫూర్తిగా తీసుకొని పేద విద్యార్థులకు అండగా నిలవాలని సూచించారు. దాత భూశంకర్ చారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్. రామ చంద్రారెడ్డి, సంగు రామకృష్ణ, ఉపేందర్, పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

# దుద్దెడలో ఉచిత హెూమియో వైద్య శిబిరం

- ఈ నెల 8వ తేదీన నిర్వహణ

తొలిపొద్దు, సిద్ధిపేట :

హైదరాబాద్ రామంతాపూర్ లోని ధర్మ కిరణ్ ప్రభుత్వ హెూమియో ఆసుపత్రి, సిద్ధిపేట జిల్లా ప్రభుత్వ ఆయుష్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 8 వ తేదీన సిద్ధిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత హెూమియోపతి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సిద్ధిపేట జిల్లా ఆయుష్ విభాగం క్యాంప్ ఇంఛార్జి డాక్టర్ కె.అనిల్ కుమార్ తెలిపారు. ఈనెల 8వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ వైద్య శిబిరంలో హైదరాబాద్ నుంచి వచ్చే వైద్య బృందం రోగులకు హెూమియోపతి చికిత్సను అందజేస్తారని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులైన అలర్జీ, ఆస్తమా, సైనసైటిస్, శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులైన గజ్జి, తామర, పులిపిర్లు, సోరియాసిస్, జీర్ణకోశ వ్యాధులైన అల్సర్, అజీర్తి, కడుపులో మంట, పైల్స్, ఫిషర్స్, ఫిస్టులా, జీవనశైలిలో మార్పుల వలన వచ్చే బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్ల సంబంధ వ్యాధులు స్పాండిలైటిస్, ఆర్థరైటిస్, సయాటికా, మోకాళ్ళ నొప్పులు, ఆనెలు వంటి వ్యాధులకు చికిత్స అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరు వినియోగించుకుని వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అందె రోడ్ల సమస్యలను పరిష్కారిస్తా

- గుంతల రోడ్లను పరిశీలించిన డిఈఈ

తొలిపొద్దు, మిరుదొడ్డి :



మారుమూల ప్రాంతాలకు వెళ్ళాలంటె నానా ఇబ్బందులు ప్రజలు పడుతుంటే సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకొవడం లేదని గ్రామ ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొనే పరస్థితులు ఎర్పడుతున్నాయని అందె గ్రామ ప్రజలు మండిపడుతున్న విషయం తెలిసిందె. మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన జేఏసీ నాయకులు మరియు వివిధ పార్టీలకు చెందిన అఖిలపక్షం నాయకులు అందరూ కలిసి మారుమూల ప్రాంతం అయిన అందె గ్రామానికి రోడ్లు వేయాలని ఇటీవల పలు శాఖల అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. గురువారం రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్ రోడ్ల పరిశీలనకై విచ్చేసి, సిద్దిపేట నుండి దౌల్తాబాద్ ఎక్స్ రోడ్ నుండి అందె గ్రామం వరకుగ్రామస్తులు తో కలసి నడుచుకుంటూ, గుంతలమయమైన రోడ్డును పరిశీలించారు,ఈ రోడ్ల దుస్తిని చూసి త్వరలోనే పరిష్కారం చేస్తాం అని హామీ ఇచ్చారు. జేఏసీ నాయకులు మారుమూల ప్రాంతం గ్రామమైన అందె గ్రామానికి గత ఇరువై సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వేసిన రోడ్లు తప్ప, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో రోడ్లు వేయకపోవడం, పాత రోడ్లన్నీ పూర్తి గుంతల మయం అవ్వడంతో, గ్రామం నుండి ప్రతిరోజు సిద్దిపేట జిల్లా కేంద్రానికి ఉన్నత చదువుల కోసం కళాశాలకు వెళుతుంటే, సరైన సమయానికి బస్సులు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు, గ్రామంలోని గర్భిణులు బాలింతలు వృద్ధులు హాస్పిటల్ లోకి వెళ్దామంటే, అంబులెన్సు రోడ్డు బాగాలేక రాకపోవడంతో, వైద్యానికి నోచుకోలేకపోతున్నారని, గ్రామంలో రైతులు పండించిన ఆకుకూరలు కూరగాయలు, అత్యధికంగా పండించినప్పటికీ రోడ్డు రవాణా వ్యవస్థ సరిగ్గా లేనందువల్ల పండించిన కూరగాయలు, సరైన సమయానికి మార్కెట్ కు తరలించకపోవడం వల్ల, నష్టపోతున్నామని, తమ గోడును తెలియజేశారు, గ్రామస్తుల సమస్యలను పరిష్కరించి వెంటనే రోడ్డు వేయాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో, జేఏసీ కన్వీనర్ వారాల రాజు కుమార్, బుంగరి సత్తయ్య,చుక్క శంకర్,అందె ప్రవీణ్,కడారి యాదగిరి,పర్శరాములు,పోచయ్య, సంతోష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు గట్ల మల్యాల విద్యార్థులు



తొలిపొద్దు, నంగునూరు :

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన బి.షణ్ముఖ ప్రియ, బి.హరిణి ప్రియ, బి.అఖిల, బి.అశ్విని, ఎం.వైష్ణవి ఈ నెల రెండవ తేదీన సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ లోని సెంట్ మేరీస్ హైస్కూల్లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ సాఫ్ట్ బాల్ బాలికల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచారు. దీంతో వేరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. వీరు ఈ విద్యార్థులు ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జగిత్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రమేశ్ తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ రాజ్ కుమార్ ను, రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక అయిన విద్యార్థులను ఆప్ కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు అభినందించారు.

# నేడు సిద్దిపేటకు వంగ రాజేశ్వర్ రెడ్డి

- పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న యువ నేత

తొలిపొద్దు, సిద్దిపేట



పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రముఖ పారిశ్రామిక వేత్త, యువ నాయకుడు వంగ రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం సిద్దిపేటకు రానున్నారు. ముందుగా ఉదయం 11గంటల 30నిమిషాలకు డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ పట్టణంలోని లక్ష్మీనరసింహ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రాఘవాపూర్ గ్రామానికి చెందిన బరిగేల సాయిని పరామర్శిస్తారు. అనంతరం వయోలా గార్డెన్స్ లో రంగధాంపల్లికి చెందిన అఖిల వివాహ వేడుకల్లో పాల్గొంటారు. 11గంటల 45నిమిషాలకు ఆర్ ఎస్ మెట్రో గార్డెన్స్ లో తుంగ కనకయ్య కుమారుడు వేణుగోపాల్ వివాహ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1కు దుబ్బాక బాలాజీ ఫంక్షన్ హాల్ లో జరుగనున్న అక్కపల్లి సాయి చరణ్ వివాహ వేడుకల్లో పాల్గొంటారు. 2 గంటలకు జక్కాపూర్ ఫంక్షన్ హాల్లో జరిగే మాటిండ్ల గ్రామానికి చెందిన కొంగరి రాజనర్సు ముదిరాజ్ కూతురు హారతి వివాహ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం 3గంటలకు చిన్నకోడూరు మండలం చెర్ల అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన తిమ్మాపురం కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారు.

# చెరుకు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బేగంపేట ముదిరాజ్ సంఘ సభ్యులు



తొలిపొద్దు, అక్బర్ పేట భూంపల్లి :

పెద్దమ్మ పెద్దిరాజు కళ్యాణమహెూత్సవ సందర్భంగా మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో పెద్దమ్మ దేవాలయంకు 7 కరెంట్ స్తంభాలు సింగిల్ ఫేస్ లైన్ ను ఆవసరం ఉందని అడగగానే కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేసినందుకు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ముదిరాజ్ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడుపొద్దు

- పోలీస్ కమీషనర్ విజయ్ కుమార్



తొలిపొద్దు, సిద్దిపేట ప్రతినిధి :

మద్యం సేవించి వాహనాలు నడిపి నిండు నూరేండ్ల జీవితాన్ని రోడ్డు ప్రమాదాల రూపంలో కోల్పోవద్దని సిద్దిపేట సిపి విజయ్ కుమార్ అన్నారు.

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో నిఘా నేత్రలను రేణుక ఎల్లమ్మ ఆలయ చేర్మెన్ మహేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్ మద్యం సేవించి వాహనాలు నడుపుతే రోడ్డుపై నడిచే వారికి కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వారి నిండు ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. ఇలాంటివి రాజీవ్ రహదారి తో పాటు ఇతర రహదారులపై కూడా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే 10 వేల జరిమానా అనేది ఇప్పుడు వచ్చింది కాదన్నారు. 2019 లోనే చట్టంలో ఉందని అన్నారు. ఈ జీవోను న్యాయస్థానంలో ఇప్పుడు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు వాహనదారులు పోలీసులకు సహకరించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదు అని పోలీస్ శాఖ తరపున విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతే పదివేల జరిమానా విదిస్తే పోలీసు వారికి ఏం రాదు అని అన్నారు. అందుకే ప్రజలందరూ సహకరించాలని అన్నారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, క్యాషియర్ కొండ్ర యాదగిరి, శాశ్వత కార్యదర్శి చందిరి దుర్గారెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లు గారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ హక్కుల సాధన, రక్షణకై ఛలో ఢిల్లీ

జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్

తొలిపొద్దు, సిద్దిపేట :



రాజ్యాంగ హక్కుల సాధన, రక్షణ కోసం జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో నవంబర్ 26న ఢిల్లీలో "ఛలో ఢిల్లీ" కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్ తెలిపారు. గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఆయన జిల్లా మాలమహానాడు బృందంతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా బైరి రమేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేయాలని, రాజ్యాంగ హక్కులను సాధించడమే లక్ష్యంగా మాలమహానాడు ఢిల్లీలో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. దేశంలో ఉన్న అన్ని వర్గాల దళితులు, వెనుకబడిన వర్గాలు సమాన హక్కులు పొందే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

రాజ్యాంగ హక్కుల సాధనకు సంబంధించి మాలమహానాడు కొన్ని ప్రధాన డిమాండ్లను ప్రకటించింది. పార్లమెంట్‌కు భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టాలని, జాతీయ స్థాయిలో మాల, మహార్ మరియు అనుబంధ కులాల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో శాస్త్రీయమైన లెక్కలు లేకుండా జారీ చేసిన జీవో నంబర్ 99, 29లను రాజ్యాంగ విరుద్ధంగా పరిగణించి తక్షణమే పునఃసమీక్షించాలని కోరారు.

న్యాయస్థానాల్లో, రాజ్యసభలో రిజర్వేషన్లు అమలు చేయాలని, భారత రాజ్యాంగాన్ని అన్ని ప్రాంతీయ భాషల్లో విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ గారి చిత్రాన్ని ముద్రించడంతో పాటు బ్యాగరి, కాటికాపరుల వృత్తులకు జాతీయస్థాయిలో తగిన గుర్తింపును కల్పించి, కేంద్ర ప్రభుత్వం గౌరవ వేతనం అందించాలన్నారు.

అలాగే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల సహకారాలు అందించాలని, పాఠశాలల ప్రార్థనల్లో రాజ్యాంగ పీఠికను తప్పనిసరిగా చదవాలనే నిబంధన చేయాలని ఆయన కోరారు. నవంబర్ 26న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బైరి రమేష్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొలిటికల్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్ ఎలుక దేవయ్య, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రాజయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరె కిషోర్, మీడియా ఇన్‌చార్జి జాల శ్రీనివాసు, దుండ్ర సుమన్, సాయి పరమేష్, సాయి శ్రీరామ్, బొల్లం రాజేష్, బైండ్ల నరేష్, మద్దూరు కనకయ్య, శ్రీరాముల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.